క్లుప్తంగా

చెత్తను కాల్చివేస్తే జరిమానా
మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చివేస్తే రూ.5వేల జరిమానా విధిస్తామని కమిషనర్ బి.వెంకట్రామ్ హెచ్చరించారు. శనివారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాదితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు.. చెత్తను డంప్‌చేసి నిప్పంటించి వెళ్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో పర్యావరణానికి హాని చేకూరుతుందని, ఇకపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఎవరూ కూడా చెత్తను రోడ్లపై పడేసి నిప్పు పెట్టరాదని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ఖాజా మోహిజుద్దీన్, పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, సిబ్బంది త్రివేణి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేస్తాం
మున్సిపల్ కమిషనర్ వాణి



ఇమామ్‌గూడలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వాణి

తుక్కుగూడ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా పురపాలికలో సూపర్ చెకింగ్ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఇమామ్‌గూడ, తుక్కుగూడలో సూపర్ చెకింగ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఈ సర్వేలో 5 శాతం సూపర్ చెకింగ్‌కు దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరలో సర్వే పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మేనేజర్ టి.పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, వార్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి
సీఐ నాగరాజు



వాహనాల తనిఖీల్లో సీఐ నాగరాజు

మీర్‌పేట: వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసాన్ని పురస్కరించుకొని రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మీర్‌పేట, బడంగ్‌పేట కూడళ్లలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడిపితే జరిగే నష్టాల గురించి వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు సూచనలు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు సారంగపాణి, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి
మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



పీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి

తుక్కుగూడ: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నగరంలోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కొత్త, పాత నాయకుల మధ్య సమన్వయం చేస్తూ కమిటీలను వేశామని పేర్కొన్నారు. ప్రతీ బూత్ స్థాయి నుంచి ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తంచేశారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

నిధులు ఆపేస్తే ప్రజలకు ఇబ్బంది

- చెరువుల వద్ద నిర్వహణకు చర్యలు తీసుకుంటా
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



పెద్దచెరువు వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలకు నిధులు, అభివృద్ధి ఆపేస్తే ప్రజలు ఇబ్బంది పడతారని, మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి పెద్దచెరువు వద్ద రూ.1కోటి 80లక్షల వ్యయంతో చేపట్టనున్న క్రీడా ప్రాంగణం, ఫెన్సింగ్ పనులకు శనివారం ఆమె శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లేక్ డెవలప్‌మెంట్ పేరుతో చెరువులను అభివృద్ధి చేయడంతో పాటు గుర్రపుడెక్క వంటి చిన్నచిన్న పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం గుర్రపుడెక్క తొలగించాలని ఎమ్మెల్యేగా తాను రెండుసార్లు లేఖ రాసినా స్పందన లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకుంటే స్థానిక కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గమే బాధ్యత తీసుకుని పనులు చేసుకోవాలని సూచించారు. తన నియోజకవర్గంలోనే రూ.270కోట్ల నిధులను నిలిపివేశారని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్ ధనలక్ష్మి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కామేశ్‌రెడ్డి, భూపేశ్‌గౌడ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

చెరువుల నిర్వహణకు చర్యలు..

ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు కోట్లాది రూపాయలతో చెరువులను అభివృద్ధి చేశామని, అధికార యంత్రాంగంతో పాటు చెరువుల నిర్వహణలో స్థానిక కాలనీవాసులకు బాధ్యత ఉంటుందని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మంత్రాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. చందన చెరువు మాదిరిగా మంత్రాల, పెద్దచెరువు వద్ద ఎప్పటికప్పుడూ నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ, సంస్థ ప్రతినిధులు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఈఎల్‌టీఏ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంఈఓ నర్సింహ సమక్షంలో శనివారం క్లస్టర్ పరిధిలోని విద్యార్థులకు ఉపన్యాస పోటీలతో పాటు ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఒలంపియాడ్ పరీక్షలో ప్రథమ స్థానంలో రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.టీనా, ద్వితీయ స్థానంలో తిమ్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎస్.జస్వంత్ నిలిచారు. ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానంలో రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.టీనా, ద్వితీయ స్థానంలో అదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని శ్రావణి, తిమ్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన హాసిని నిలిచారు. వారికి ఎంఈఓతో కలిసి సంస్థ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు మూర్తుజా, శేఖర్‌రెడ్డి, రాఘవీ తదితరులు పాల్గొన్నారు.

19న పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

మీర్‌పేట: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీరుడు పండుగ సాయన్న అని ఎడ్ల మల్లేశ్, చింతల రాఘవేందర్ ముదిరాజ్‌లు తెలిపారు. సాయన్న పోరాట స్ఫూర్తిని, ఆయన జీవిత చరిత్రను భావితరాలకు తెలిసేలా విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన విగ్రహాన్ని ఈ నెల 19న మీర్‌పేట చందన చెరువు వద్ద ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఇరువురు.. ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి విగ్రహ ఏర్పాటుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని శిల్పికి అందజేశారు. కార్యక్రమంలో జగన్, సుదర్శన్, శివశంకర్, కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ ఎత్తు పెంచండి



మెట్రో డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

బడంగ్‌పేట్: మెట్రో విస్తరించడం సంతోషంగా ఉందని, అందే సమయంలో స్టేషన్ ఎత్తును పెంచాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నాయకులు కోరారు. శనివారం ఎల్ అండ్ టీ మైట్రో సంస్థ నామిని డైరెక్టర్ ఎస్‌వీఎస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సమితి కార్యదర్శి శశిధర్, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు క్లోం నిరంజన్‌రెడ్డి సంయుక్తంగా మాట్లాడారు. నగరంలోని పాతబస్తీ మీదుగా మెట్రో సేవలు విస్తరించడం హర్షణీయమన్నారు. ప్రధాన రహదారి లాల్ దర్వాజ మోడ్, చార్మినార్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్, ఫలక్‌నుమా, షాలిబండ తదితర ప్రాంతాల్లో నిర్మిస్తున్న మెట్రో స్టేషన్ ఎత్తును పెంచాలని పేర్కొన్నారు. వినాయక నిమజ్జనంతో పాటు ఇతర కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని, ఈ అంశాన్ని పరిశీలించాలని కోరారు. సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

- ప్రమాణస్వీకారంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్



కుమార్‌ను అభినందిస్తున్న అనితారెడ్డి, కేఎల్లార్

మహేశ్వరం: మహేశ్వరంలో ప్రసిద్ధిగాంచిన శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ ఆలయ ప్రాంగణంలో చైర్మన్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన అల్లె కుమార్, డైరెక్టర్లు శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ అల్లె కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన శివాలయం మహేశ్వరంలో కొలువుదీరడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పెద్దలు, మండల ప్రజల సహకారంతో మరింత కృషి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. చైర్మన్‌తో పాటు ఆలయ డైరెక్టర్లుగా ఒగ్గు శంకర్, ఏపూరి సాయిలు, పెయ్యల సువర్ణ, గద్దగూటి నరేశ్, మోదిని రాకేశ్, పోతర్ల తిరుపతయ్య, కనగట్ల శ్రీశైలం ప్రమాణస్వీకారం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

శివగంగ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవానికి వారు హాజరై చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహేశ్వరంలో కొలువుదీరిన శివగంగ రాజరాజేశ్వర ఆలయం ప్రసిద్ధిగాంచిందన్నారు. ఇక్కడ గంగలో శివుడు, పార్వతీ మాతలు కొలువుదీరారన్నారు. భక్తుల కొంగు బంగారం శివగంగ ఆలయమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఆలయ చరిత్ర, గొప్పదనం గురించి తెలియజేసి నిధులు మంజూరు చేయిస్తామని వారు తెలిపారు. అంతకుముందు ఆలయ చైర్మన్ అల్లె కుమార్‌తో పాటు డైరెక్టర్లను వారు ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఈఓ మురళీకృష్ణ, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్, వత్తుల రఘుపతి, అంధ్యానాయక్, ప్రశాంత్‌రెడ్డి, కృష్ణనాయక్, కర్రొళ్ల చందుముదిరాజ్, ఆవుల యాదయ్య, శివ, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్లు సక్రమంగా నిర్వహించేలా చూడాలి

- మున్సిపల్ కమిషనర్ సరస్వతి



ఏబీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సరస్వతి పర్యటించారు. నాదర్‌గుల్‌లోని ఏబీసీ సెంటర్‌ను, అక్కడ కుక్కల నియంత్రణకు సంబంధించిన ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. శునకాలకు వేయవలసిన వ్యాక్సిన్లు, వాటికి ఎలాంటి ఆహారం అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వాటి నియంత్రణ ఆపరేషన్లు సక్రమంగా నిర్వహించేలా చూడాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే తడి, పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోల్లో మాత్రమే వేయాలని, బహిరంగ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్లలో, రోడ్లకు ఇరువైపులా చెత్త వేయరాదని సూచించారు. నిర్లక్ష్యంగా ఎవరైనా చెత్త వేసినట్లయితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: రైతు సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘ్ నిరంతరం పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా సహా కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా, మండల కమిటీకి చెందిన సంఘం సభ్యులు పాల్గొన్నారు. గ్రామంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ కిసాన్ సంఘం అనేది ఏ పార్టీలకు అనుబంధం లేకుండా రైతు సమస్యలపై పనిచేస్తోందన్నారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఈ సంఘాలను బలోపేతం చేసుకుంటే సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కందవాడ గ్రామ నూతన కమిటీని ఎన్నుకొని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్.కృష్ణారెడ్డి, కార్యదర్శిగా కె.విశ్వనాథం, సభ్యులుగా రవీందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రంగారెడ్డి, సాయిగౌడ్, మల్లేశ్,దశరథ్, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పెంటారెడ్డి, మండల కమిటీ సభ్యులు వీరేశం, ఈశ్వరప్ప, శివుడు, నర్సింహారెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో 65 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేర్చుతుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, తహసీల్దార్ సురేందర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్‌ఐ తేజ, కౌన్సిలర్ చంద్రమౌళి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇస్తేమా ఏర్పాట్లపై చర్చ

శంకర్‌పల్లి: పట్టణంలోని జంబోరి ప్రాంగణంలో జరుగుతున్న ఇస్తేమా ప్రాంతాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం సందర్శించారు. ముస్లిం మత పెద్దలతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇస్తేమాలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అదేవిధంగా పోలీస్, మున్సిపల్ కంట్రోల్ కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఇస్తేమా ముగుస్తున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు ఆర్డీఓ చంద్రకళ, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబు, నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశవర్కర్ల వేతనాలు పెంచాలి



షాద్‌నగర్: మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆశవర్కర్లు

- మంత్రి సీతక్కకు సీఐటీయూ నాయకుల వినతి

షాద్‌నగర్: ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు అందించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం షాద్‌నగర్ పర్యటనలో భాగంగా మధురాపూర్ గ్రామానికి విచ్చేసిన మంత్రిని సీఐటీయూ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. నెలకు కనీసం రూ.18వేల వేతనం ఇవ్వాలని, అదేవిధంగా పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. గత పాలకులు ఆశవర్కర్లను నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనాన్ని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, సంఘం నాయకులు బీస సాయిబాబ, శ్రీనునాయక్, పద్మారెడ్డి, రాయకంటి గోపాల్, ఆశవర్కర్లు సునీత, లలిత, రాధిక, కేతన, పావని, షకీలా, సుమలత, సునీత, పుష్ప, శ్రీదేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

చేగూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయండి

నందిగామ: అన్ని రకాల సౌకర్యాలు కలిగి.. అనేక గ్రామాలకు అనుకూలంగా ఉన్న చేగూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, చేగూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన మంత్రికి శివశంకర్‌గౌడ్ చేగూరు మండల ఏర్పాటు విషయాన్ని వివరించారు. చేగూరుతో పాటు పక్కనే కన్హా ఆశ్రమం, బుగ్గోనిగూడ, బండోనిగూడ, వెంకమ్మగూడ, నర్సప్పగూడ, వీర్లపల్లి, ఈదులపల్లి, మామిడిపల్లి తదితర గ్రామాలకు అతి సమీపంలో ఉందని, పక్కనే అంతర్జాతీయ యూనివర్సిటీ, ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఉందని వివరించారు. ఈ విషయమై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. చేగూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేసే ప్రక్రియను పరిశీలిస్తామని, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎంను ఒక్కసారి కలిసి విజ్ఞప్తి చేస్తే సరిపోతుందని చెప్పారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా నూతనంగా 22 గ్రామ పంచాయతీలు ఏర్పాటు కాబోతున్నాయని మంత్రి చెప్పారు.

పచ్చదనం.. పరిచేలా

గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా నర్సరీల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి సిబ్బందితో నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నారు. అధికారులు నిరంతరం సందర్శిస్తూ కూలీలకు సలహాలు ఇస్తున్నారు.



కుమ్మరిగూడలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్

మండలంలో 4 లక్షల 50 వేల మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు

- నర్సరీల్లో పూర్తయిన బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- త్వరలోనే విత్తనాలు నాటేందుకు చర్యలు
- జూలైవరకు సిద్ధం చేసేందుకు ప్రణాళిక

షాబాద్: గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో అధికారులు మొక్కలు నాటేందుకు ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా స్థలాలను ఎంపిక చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందుకు సంబంధించి మొక్కల పెంపకానికి నర్సరీల నిర్వహణ పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సారి మండలంలో 4లక్షల 50వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందుకే అధికారులు గతేడాది కంటే ముందుగానే ఈసారి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తిచేసిన నర్సరీలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో విత్తనాలు నాటే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం మండల అధికారులు నర్సరీలను సందర్శిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలకు తగిన సూచనలు చేస్తున్నారు.

లక్ష్యం 10వేల మొక్కలు..

మండలంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీలల్లో మొత్తం 4 లక్షల 50వేల మొక్కల పెంచాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి సిబ్బంది పనులు చేపడుతున్నారు. ప్రతీ పంచాయతీకి 10 వేల మొక్కలు పెంచేందుకు అవసరమైన బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తిచేశారు. అదేవిధంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రాంతాలను ముందుగానే గుర్తిస్తున్నారు.

అవసరమైన మొక్కలు నాటేందుకు..

మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో ఇప్పటికే విత్తనాలు నాటే పనులు కొనసాగుతున్నాయి. నర్సరీల్లో ముఖ్యంగా తాటి, ఈత, కానుగ, నేరేడు, స్పటోడియా, గుల్మోరా, రాగి, మర్రి, చింత, సీతాఫలం, తులసీ, కలమంద మొక్కల విత్తనాలను ఎక్కువగా నాటిస్తున్నట్లు ఎంపీడీఓ అపర్ణ, ఏపీఓ వీరాసింగ్ తెలిపారు. గ్రామా ల్లో ఇళ్ల వద్ద నాటుకునేందుకు వీలుగా గులాబీ, గన్నేరు. మందారం, నందిదర్దిన, బొప్పాయి, కరివేపాకు, మునగ, జామ, దానిమ్మ, నిమ్మ మొక్కలకు సంబంధించిన విత్తనాలు సైతం నాటిస్తున్నట్లు వెల్లడించారు.



షాబాద్ నర్సరీలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

ఏర్పాట్లు పూర్తిచేశాం



మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో నల్ల, ఎర్రమట్టిని బ్యాగుల్లో నింపించాం. విత్తనాలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే విత్తనాలు మొలకెత్తాయి. 2025 జూలై నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. వర్షాలు కురిసిన వెంటనే గుంతలు తీయించి మొక్కలు నాటిస్తాం.
– వీరాసింగ్, ఏపీఓ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386